## పేషెంట్ చెప్పే కథలు



# భయం

డాక్టర్
ఆలూరి విజయలక్ష్మి

"ఇంత సాహసమెందుకు చేశారమ్మా! మీరు లేకపోతే ఈ పసివాళ్ళంతా ఏమైపోతారు?" తల్లి గండం గడిచి బయటపడిందో, లేదో తెలియక బిక్క మొహాలేసుకుని నుంచున్న పిల్లల్ని చూపిస్తూ అడిగింది శ్రుతి. "తనలాంటి వాళ్ళకు చావటం సాహసం కాదు బ్రతకడమే సాహసం" అనుకుంది కామాక్షి. మసకబారిన కళ్ళముందు రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనలు కదల సాగాయి.

* * *

శ్రుతి రాసిచ్చిన టానిక్కుల లిస్ట్ వంక ప్రాణంలేనట్టు చూసింది కామాక్షి. తను గర్భవతి అని తెలిస్తే యింటా, బయటా తనను కాకుల్లా పొడుస్తారని, తనకీ బిడ్డ వద్దని ఏ విధంగానైనా తనకు గర్భస్రావం చేసేయమని డాక్టర్ని ప్రార్థించిందామె. కాని ఈ పరిస్థితిలో గర్భస్రావం చెయ్యటం ప్రమాదమని. యింక నాలుగు నెలల్లో బిడ్డకాస్తా బయటపడ్డాక యింక పిల్లలు పుట్టకుండా చేసేస్తానని చెప్పి సాగనంపింది శ్రుతి.

రెండేళ్ళ క్రితం ఆఖరి పిల్లకడుపులో వున్నప్పుడు జరిగిన సంఘటన గుర్తొచ్చి భయంతో జలదరించింది కామాక్షి శరీరం.

"ఏమంత మర్యాద, మాన్యాలు మూలుగుతున్నాయని యింతమంది పిల్లల్ని కనడం? ఈ వయసులో పిల్లలు! సిగ్గుచేటు!" కోడలు హైమావతి

"ఏళ్ళు రాగానే సరికాదు. నలుగురూ ఏమనుకుంటారో అనే సిగ్గూ, ఎగ్గూ లేకుండాపోయింది మనుషులకు.." రెండో మాతృస రాధ. అటుగా వెళ్ళిన కామాక్షికి వద్దనుకున్నా వాళ్ళ మాటలు చెవిలో పడ్డాయి.

దోషిలా అందర్నీ తప్పుకు తిరిగి ఈ అర్భకురాల్ని ప్రసవించింది. తనకు ప్రతి కానుపు గండమే. ప్రతిసారి కిందెట్టు, మీదెట్టు. అందుకే తెగించి ఆ సమయంలో ఆపరేషన్ చేయించుకోవడానికి వీలుండేదికాదు. తరువాత సంసారపు రుంఝాటంలో వెసులుబాటయ్యేది కాదు. కొంచెం వయసు గడిచాక ఈ వయసులో యింక పిల్లలేం పుడతార్లే అన్న అజ్ఞానం, తన ఆరోగ్యం గురించి తెలిసికూడా ఆపరేషన్ చేయించుకోని భర్తను చూసి ఆవేదన. పుట్టిన పిల్లలకు తిండి పెట్టలేని అశక్తత, కాలానుగుణంగాలేని తమ ప్రవర్తనపై కోపం.... ఒకవైపు హృదయం చిత్రవధ ననుభవిస్తున్నా పిల్లలకోసం బలవంతాన అన్నిటినీ సహించింది.

కలలో నడిచినట్లు నడుస్తున్న కామాక్షికి అదంతా గుర్తొచ్చింది. మనసులో ఏదో ఊగిసలాట. అంతలోనే విరక్తి, అంతలోనే పిచ్చి తెగింపు. నాలుగు మందుల షాపుల దగ్గర ఆగి మాత్రల్ని కొని జాగ్రత్తగా దాచింది ఇంటికి వచ్చి పెద్ద కోడలు రసు పెట్టిన ముద్ద తిని నడుం వాల్చుకుని పడుకుంది. మనసంతా ఆలోచనల్తో గందరగోళంగా తయారయింది. గాలికి పుట్టి, గాలికి పెరిగి ఎందుకు బ్రతుకుతూందో తెలియకుండా నిస్సారంగా బ్రతికిందిన్నాళ్ళూ. దుర్భరమైన దారిద్ర్యంతో పోరాడి పోరాడి అలిసిపోయింది. మళ్ళీ ఈ బెడద. మళ్ళీ కన్నబిడ్డల ఎదుట అపరాధిలా తల వంచుకుని బ్రతకవలసి రావడం తన ప్రారబ్ధం కాకపోతే ఈ వయసులో తనకీ రాతేమిటి! ఈ విషయం నలుగురికీ తెలిస్తే తను బ్రతకలేదు.... తనకు చావంటే భయం లేదు. అసలు తనలాంటి వాళ్ళు బ్రతకడానికి భయపడాలికాని చావడానికికాదు.... ఇల్లంతా సద్దుమణిగాక, తనలోని సంఘర్షణో కొలిక్కి తెచ్చి, ఒక నిశ్చయాని కొచ్చి, మనసుని రాయి చేసుకుని కొని దాచుకున్న మాత్రలన్నిటినీ గబగబా మింగింది.. యింక తనకంతా ప్రశాంతత. జీవితంలో యింతకు ముందెప్పుడూ రుచి చూడని ప్రశాంతత. తనింక బిడ్డల్ని పస్తు పడుకో బెట్టడమెలాగా అని బాధపడనక్కర్లేదు. జబ్బు చేసి ప్రమాదంగా వున్న పిల్లల్ని గాలిలో పెట్టి 'దేవుడా! నీ మహిమ!' అననక్కరేదు. తెల్లారి లేచిందగ్గర్నుంచి ఇంటివాడితో, పాలవాడితో, చిల్లర దుకాణంవాడితో, అప్పులిచ్చిన వాళ్ళతో మాటలు పడడమెలాగా అనే భయంతో చావనక్కర్లేదు. ఇంక తనపాలిట సిగ్గు, అవమానాలు వుండవు. ఏమిటిలావుంది! గమ్మత్తుగా, ఏవో లోకాల్లోకి ఎగిరిపోతున్నట్టుగా.... తనెక్కడికెగిరిపోతూంది? స్వర్గానికా?.... ఏమిటి తను హాయిగా స్వర్గానికెగిరిపోతూంటే ఎక్కడిదీ కీచుమని ఏడుపు?.... తన కడసారి పిల్లకదూ?.... రేపటినుంచి దానికి పాలెవరు పడతారు? తన చిన్నారి బిడ్డల ఆలనా, పాలనా ఎవరు కనుక్కుంటారు? ఎవరు తన బంగారు కన్నల ఆకల్ని కనిపెట్టి అన్నం పెడతారు?.... అమ్మో! వద్దు. తను చచ్చిపోదు.... తను బ్రతకాలి.... తను బ్రతుకుతుంది. కష్టమో, సుఖమో, చావో, రేవో తను బ్రతకాల్సిందే. బ్రతికి రోజూ ఆకలితో, అవమానాలతో యుద్ధం చేస్తూ ఎప్పటికైనా మంచి రోజులు రాకపోతాయా అన్న ఆశతో తన బిడ్డల్ని పెంచుతుంది.... అయ్యో! పిల్ల గుక్కలు పట్టి ఏడుస్తూంటే తనింకా పడుకునే వుందేమిటి? లేచి వెళ్ళాలి. పాపకు పాలు పట్టాలి.... మూసుకుపోతున్నకళ్ళను బలవంతాన విప్పడానికి ప్రయత్నిస్తూ అవయవాలను స్వాధీనంలోకి తెచ్చుకుని లేవడానికి ప్రయత్నిస్తూ కుప్పలా కూలిపోయింది కామాక్షి!